క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.05 లక్షల విరాళం



దాత శ్రీరామచంద్రమూర్తికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు శనివారం రూ.1,05,055 విరాళంగా అందించారు. తెలంగాణ రాష్ట్రం, భద్రాచలంకు చెందిన పేరిశెట్టి వీరవెంకట శ్రీరామచంద్రమూర్తి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

పోలవరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని తహసీల్దార్ బి సుమతి సిబ్బందిని ఆదేశించారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల వయసు రీత్యా ఎంత బరువు ఉన్నారు, ఎంత బరువు ఉండాలి అనే విషయాలను తెలుసుకున్నారు. కేంద్రాలకు ఏఎన్ఎంలు పరిశీలన ఉందా లేదా అనే విషయాలను కూడా తెలుసుకున్నారు. కేంద్రాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.


నూతన వధువుకు కల్యాణ ఖర్చుల అందజేత



నూతన వధువుకు సొమ్ము అందజేస్తున్న సర్పంచ్ దంపతులు

కొయ్యలగూడెం : రామానుజపురం గ్రామానికి చెందిన నూతన వధువు మురమళ్ల వెంకట లక్ష్మికి సర్పంచ్ అడపా నాగలక్ష్మి, రాంబాబు దంపతులు సీతమ్మ కల్యాణం పథకం సొమ్ము అందజేశారు. సర్పంచ్‌గా ఎన్నికైన నాటినుంచి నాగలక్ష్మి ఈ పథకం కింద ఇప్పటివరకు 42 మంది వధువులకు కల్యాణ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన వారికి, ఆర్థిక స్థోమత లేనివారికి కుల, మతాలకు అతీతంగా ఈ పథకం కింద సొమ్ము అందజేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులను పలువురు అభినందించారు.

సుబ్బరాజు హైస్కూల్ తనిఖీ



హైస్కూల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్

చింతలపూడి : పట్టణంలోని సుబ్బరాజు హైస్కూల్‌ను జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని గర్భిణుల వివరాలు, బరువు తక్కువ పిల్లల వివరాలు సేకరించారు. అదే విధంగా డ్రాపవుట్స్ గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ మురళీ కృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, ఎంఈఓ కిరణ్‌బాబు తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

జంగారెడ్డిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఎక్కడా సమస్యలు, అవకతవకలు తలెత్తకుండా సిబ్బంది చూడాలన్నారు. ఇన్‌చార్జి డ్వామా పీడీ, ఇన్‌చార్జి ఏపీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. ఏపీడీలు ప్రబుల్ కుమార్, కె. పురుషోత్తం, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, ఏపీవో శ్రీదేవి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి విశేష కృషి



తీగలపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నర్సాపురం : గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీ సంగారావుపేట, తీగలపల్లి 1, తీగలపల్లి 2, సున్నపురాళ్లపల్లిలలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు ఆయా గ్రామాల్లో గిరిజనుల ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు 50 ఏళ్లు నిండితే పింఛన్ సౌకర్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పిస్తుందని గుర్తు చేశారు. గతంలో ఎప్పుడూలేని విధంగా గిరిజనులను ఈ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ప్లెయిన్ ఏరియాలో కన్నా అధికంగా నిధులు ఇచ్చి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తుందని వివరించారు. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలను పంచాయతీ పరిధిలోని గ్రామాలలో మంచినీటి సౌకర్యం, సీసీ రోడ్ల అభివృద్ధికి కేటాయించాలని ఎంపీపీ ధారబోయిన లక్ష్మీకి సూచించారు. అలాగే వాటికి తోడు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మరో రూ.5 లక్షలు కేటాయించాలని అధికారులకు సూచించారు. సంక్షేమానికి పెద్ద పీట వేసినది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమని వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా పథకాలను అందించిన ఏకైక ప్రభుత్వం తమదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు వెంట ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు కురసం నిరీక్షణ రావు, మక్కువారిగూడెం సహకార సంఘ చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, మండల రైతు విభాగం అధ్యక్షుడు మక్కిన వెంకట గోపాలరావు, సర్పంచ్ సోయం బిందు, వైస్ ఎంపీపీ బుర్ల దివ్యభారతి, దేవరపల్లి ముత్తయ్య, యర్రా గంగాధర్ రావు, దాకారపు సూరిబాబు, పిన్నమనేని మురళి, పూసం సూర్య చంద్రరావు, వెలిది నాగబాబు వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కన్నం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

జంగారెడ్డిగూడెం: ఇచ్చిన మాట ప్రకారం నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చింతలపూడి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పాడ నరసింహారావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో నాయీ బ్రాహ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ఉన్న 610 దేవాలయాలకు పాలకవర్గంలో ఒకరికి అవకాశం కల్పిస్తామని ఇచ్చిన జీవోని ఆధారంగా ప్రతి ఆలయంలో డైరెక్టర్‌గా నియమిస్తున్నారని, దానిలో భాగంగా టీటీడీ తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్‌గా సిద్ధవటం యానాదయ్యను నియమించారన్నారు. ఇలా నాయీ బ్రాహ్మణులను ఏ ప్రభుత్వం గుర్తించలేదన్నారు. నాయీబ్రాహ్మణులకు గౌరవం కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చింతలపూడి నియోజకవర్గ నాయీబ్రాహ్మణుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కునూరులో భారీ వర్షం

కుక్కునూరు: అల్పపీడన ప్రభావంతో శనివారం కుక్కునూరు మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులన్నీ వాననీటితో నిండాయి. కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. చెరువులకు వరద నీరు వచ్చి చేరింది. వర్షం కారణంగా మండలంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఓ పక్క వర్షాలు దంచికొడుతుండగా మరో పక్క వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మండలంలో పలు పంచాయతీలలో రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేసే పనులు చేపట్టారు.

చెక్కుల అందజేత

ఏలూరు(మెట్రో): మండవల్లి మండలం మండవల్లికి చెందిన తేరా కుమార్ కడప సెంట్రల్ జైల్లో శిక్షను అనుభవిస్తూ మరణించారు. దీంతో కుమార్ కుటుంబానికి న్యాయ పరంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు మంజూరు చేసింది. కుమార్ భార్య కూడా మరణించడంతో వారి కుమారులు అఖిల్ దత్, నిఖిల్ దత్‌లకు చెరో రూ.2 లక్షలు చొప్పున చెక్కులను శనివారం ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జేసీ బి.లావణ్యవేణి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాలసేవ, ఆరాధన, తీర్థ ప్రసాదగోష్టి తదితర పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. దాతలు బంక అశోక్‌కుమార్, పారుపల్లి రామకృష్ణ, జెట్టి సత్యనారాయణ, గంటా వెంకటనాయుడు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఈవో మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, దండు ధనరాజు, వాసవీసాయి నగేష్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

- పూర్తయిన గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం
- ఎమ్మెల్యే ఎలీజా చొరవతో పనులు పూర్తి
- సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభానికి సన్నాహాలు



చింతలపూడిలో సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : చింతలపూడిలో నిర్మాణం పూర్తయిన సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. శనివారం గురుకుల పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2011లో గురుకుల పాఠశాల మంజూరైందని తెలిపారు. 2013 డిసెంబర్‌లో 5 ఎకరాల స్థలంలో ఈ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారని చెప్పారు. మొత్తం రూ.10.12 కోట్ల వ్యయంతో గురుకుల పాఠశాల నిర్మాణం చేపట్టారని, నిర్మాణంలో భాగంగా విద్యార్థుల డార్మెటరీ, పాఠశాల భవనాలతో పాటు వంట గది, డైనింగ్ హాలు, స్టాఫ్ క్వార్టర్లు, ప్రిన్సిపాల్ క్వార్టర్ నిర్మాణ పనులు ఏకకాలంలో చేపట్టాల్సి ఉందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా పనులు నిలిచి పోయాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీంతో భవనాలను పూర్తి చేసి సెప్టెంబర్ మొదటి వారంలో విద్యార్థులను నూతన భవనాల్లోకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, పార్టీ నాయకులు మునునూరి వెంకటేశ్వరరావు, చుండూరి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు కె.యువరాజు, యడ్ల మోహన్‌రావు, పెరుగు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రి పరిశీలన

చింతలపూడిలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని ఎమ్మెల్యే ఎలీజా పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నియోకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాగింగ్ విష సంస్కృతికి దూరంగా ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి : భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులను గురించి విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ లాంటి విష సంస్కృతికి విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో పెరిగిపోతున్న ర్యాగింగ్ భూతం నిర్మూలనకు సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసిందన్నారు. ప్రతి కళాశాలలో బోర్డులు ఏర్పాటు చేయడం, ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కళాశాల నుంచి శాశ్వతంగా బయటికి పంపడంతో పాటు కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. పోక్సో చట్టం ద్వారా ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలకు కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పింగుల దేవిడ్ రాజు, వెంకట చైతన్య, ఉమర్ ఫరూఖ్, కొవ్వూరి కనకదుర్గ, ఏసుపాదం, ఇర్ల వెంకటేశ్వరరావు, సీడీపీఓ మాధవి, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, ప్రిన్సిపాల్ తాడేపల్లి స్కైలాబ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్లపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ లక్ష్మీ సుజన

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు ద్వారకాతిరుమల సచివాలయం-2 మహిళా సంరక్షణ కార్యదర్శి పి.లక్ష్మీ సుజన ట్రాఫిక్ సిగ్నళ్లపై శనివారం అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం విధించే జరిమానాలు, శిక్షలను గూర్చి తెలిపారు. నిబంధనలను సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రోడ్డుపై సూచిక బోర్డులను క్షుణ్ణంగా పరిశీలించి వాహనాలను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి, వైస్ ప్రిన్సిపాల్ పి.విజయభారతి, కె.సజయ, డి.విప్లవ కుమారి, ఎం.మెహర్ జ్యోతి, బి.శ్రీదేవి, సీహెచ్ వెరోనిక, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



జంగారెడ్డిగూడెంలో రిక్షాలు, పుష్‌కార్టులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : పారిశుధ్యం మెరుగుదలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు గాను మున్సిపల్ సాధారణ నిధులతో కొనుగోలు చేసిన రిక్షాలు, పుష్‌కార్టులను శనివారం ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజారోగ్యం, సుందరీకరణ తదితర వాటిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి పారిశుధ్య నిర్వహణకు గాను చెత్తను సేకరించేందుకు 16 రిక్షాలు, 15 పుష్‌కార్టులు రూ. 7.11 లక్షలతో కొనుగోలు చేశామన్నారు. అలాగే కొవ్వూరు రోడ్డు నుంచి బైపాస్‌కు వెళ్లేందుకు స్థానిక ఫైర్‌స్టేషన్ పక్కన ఉన్న రోడ్డు శిథిలావస్థలో ఉండటంతో, మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించేందుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. రోడ్డును పూర్తిగా తవ్వి వెట్‌మిక్స్‌తో రోడ్డు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవీరత్నం, స్థానిక కౌన్సిలర్ గీతాకుమారి, పట్టణ కమిటీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు గిరిబాబు గౌడ్, మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, మెప్మా టీఎంసీ నాగమణి, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలు సృష్టించడమే లక్ష్యంగా లోకేష్ పాదయాత్ర

భీమడోలు: వివాదాలు సృష్టించడమే లక్ష్యంగా లోకేష్ పాదయాత్ర సాగుతోందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్రలను చేయాల్సి ఉండగా రాష్ట్ర మాజీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ వాటి అర్థాన్ని మార్చి ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి ఆయా కుటుంబాల్లో తీరని వ్యధను మిగిల్చుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో శనివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరులో చంద్రబాబు కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడి చేయించాడని, ఏలూరు జిల్లాలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని విమర్శించారు. తండ్రీకొడుకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కార్యకర్తలు, నాయకులు దాడి చేసి పోలీసు కేసుల్లో ఇరుక్కున్నారని, వారంతా ఇంకా కేసుల నుంచి బయట పడలేదన్నారు. పాదయాత్రల్లో వారు ప్రజా సమస్యలను తెలుసుకోవడం, తాము గెలిస్తే ఏమి చేస్తామో చెప్పడం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సువర్ణాక్షరాలతో నిలిచి ఉంటుందని అన్నారు. చంద్రబాబు, లోకేష్ తమ ఉనికిని కాపాడుకోవడానికి పాదయాత్ర చేస్తున్నారని, దీని వల్ల ప్రజలకు ఒరిగేదీమీ లేదని ఆయన విమర్శించారు.

మదర్ థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకం



చింతలపూడి : ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి : మదర్ థెరిస్సా జయంతిని చింతలపూడిలో శనివారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు తూము విజయకుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ డా లిటోరియ దేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ సుజానమ్మ, ఎస్‌కే ఆజాద్‌బాబు, అశోక్‌బాబు, సురేంద్ర, ఎస్.సూర్యకుమార్, రామిశెట్టి సత్యన్నారాయణ, కొత్తపూడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనం అందజేత

ద్వారకాతిరుమల: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలోని అమ్మా-నాన్న, వికలాంగుల సేవా సంస్థలోని వృద్ధులకు శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది శనివారం భోజనాన్ని అందజేశారు. మదర్ థెరిస్సా చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వారు కోరారు.



టి.నర్సాపురం : పీహెచ్‌సీ వద్ద మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



పోలవరం రూరల్: మథర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

టి.నర్సాపురం : కుల మతాలకు అతీతంగా మానవత్వాన్ని పంచిన ఆదర్శమూర్తి మదర్ థెరిస్సా అని మండల వైద్యాధికారిణి జే కల్పనా రాణి అన్నారు. టీ నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మదర్ థెరిస్సా జయంతి వేడుకలలో కల్పనా రాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ ఫణీంద్రబాబు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం కన్నాపురం రోడ్డులోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోనా దయరాజు, మడుతూరి శ్రీను బ్రదర్స్, రవి, వీరబాబు పాల్గొన్నారు. కొవ్వూరు రోడ్డులో బొబ్బర మంగరాజు ఆధ్వర్యంలో థెరిస్సా విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించారు. గవరవరంలోని థెరిస్సా విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పోలవరం రూరల్: పోలవరంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పోలవరం మెయిన్ సెంటర్లో జయంతి వేడుకలు నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవా సంఘం ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో కలిసి థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఏ తరానికైనా థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. సేవా సంసంఘం సభ్యులు షేక్ షాహిన్‌షా బాషా, పఠాన్ కాజా, ఎస్.సుధీర్, ల్యాబ్ సుధాకర్ బన్ను రషీద్, ఆటో మెకానిక్ రాంబాబు, ఖలీల్, రాంపండు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యం



విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో ఇంటింటికీ వైద్యం అందుబాటులోకి వచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా డి.ఆశ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రగడవరం గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ విధానంలో నెలలో రెండు సార్లు వైద్యులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు అందుతున్న సేవలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట కె.గోకవరం వైద్యాధికారి డా ఆర్ కృష్ణకిషోర్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్, ఎంఎల్‌హెచ్‌పీ భరత్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

నేడు తెలుగు భాషా సంబరాలు

ఏలూరు (టూటౌన్): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలుగు భాషా దినోత్సవం సంబరాలు, కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనం 123వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంగా నమోదు కానున్నట్టు పేర్కొన్నారు. ఏలూరు నగర వీధుల్లో తెలుగు భాష దినోత్సవ సంబరాలు పేరుతో ప్రాచీన కవుల వేషధారణలతో ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.